
సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం : 20 : ఏప్రిల్ : 2025



ఆ ఊరంతా నారసింహులే..

ఆ ఊరిలో వెలిసిన నారసింహుడంటే వారికెంతో నమ్మకం. ఆ ఊరిలో మగబిడ్డ పుట్టినా.. ఆడ బిడ్డ పుట్టినా.. స్వామి పేరు పెట్టుకోవడం ఆనవాయితీ. 4లో ▸



పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. 4లో ▸



రొయ్యను మేమే అమ్ముకుంటాం

రొయ్య రైతులు తమ పంటను తామే విక్రయించుకోవాలనే సంకల్పంతో డొమెస్టిక్ సేల్స్ కౌంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 4లో ▸

కంటి వెలుగు లేదు

కూటమి చిన్నచూపు

- 8 నెలలుగా నిలిచిన ఈఐ కేంద్రం సేవలు
- కాంట్రాక్టు సంస్థతో గత సెప్టెంబరులో ముగిసిన ఎంఓయూ
- రెన్యువల్‌కు చొరవ చూపని కూటమి ప్రభుత్వం
- కంటి వైద్య సేవల కోసం పేదల ఇబ్బందులు
- గత ప్రభుత్వంలో జిల్లాలో 1,30,733 మందికి కంటి పరీక్షలు
- 90,059 మందికి కళ్లజోళ్ల పంపిణీ

గత ప్రభుత్వంలో ఈఐ కేంద్రాల్లో అందించిన సేవలు

ఈఐ కేంద్రం	వైద్య పరీక్షలు	రిఫ్రాక్షన్ చెక్స్	కళ్లజోళ్ల పంపిణీ	ఫండస్ చెక్స్
ఆచంట	27,970	27,832	18,131	13,831
ఆకివీడు	20,576	20,407	13,688	7,246
భీమవరం	23,944	23,638	17,807	8,899
పాలకొల్లు	30,553	29,815	21,443	12,491
నరసాపురం	27,690	26,666	18,990	10,635



ఖాళీగా మారిన ఆకివీడు సీహెచ్‌సీలోని ఈఐ కేంద్రం (ఫైల్), భీమవరం సీహెచ్‌సీలో మూతపడిన కేంద్రం (అంతరచిత్రం)

సాక్షి, భీమవరం: పేదల కంటి వైద్యానికి కూటమి ఎగనామం పెట్టింది. సీహెచ్‌సీల్లోని ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల కాంట్రాక్టు గడువు ముగిసి ఎనిమిది నెలలుగా సేవలు నిలిచినా పట్టనట్టు వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు అంతంతమాత్రంగానే ఉండటంతో పేదవర్గాలు కంటి పరీక్షల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

జిల్లాలోని ఐదు కేంద్రాల్లో..

జిల్లాలోని భీమవరం, ఆచంట, ఆకివీడు, పాలకొల్లు, నరసాపురంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ల్లో ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల ద్వారా ప్రజలకు ఉచితంగా కంటి వైద్యసేవలు అందించేవారు. ప్రభుత్వం ఈ కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఒక్కో కేంద్రంలో ఒక ఆప్తమాలజీ అసిస్టెంట్, ఒక ఎక్యూప్మెంట్ అసిస్టెంట్ అందుబాటులో ఉండేవారు. ఆధునాతన ఆటోమెటిక్ రిఫ్రాక్టర్ మీటర్, కంటి లోపల భాగాలను పరీక్షించే ఫండస్ కెమెరాలతో కంప్యూటర్ ద్వారా డీఆర్, గ్లకోమా, కాటరాక్ట్, మాక్యులర్ డీజనరేషన్, హైపర్‌టెన్సీవ్ రెటీనోపతి తదితర సుమారు రూ.3 వేల విలువైన పరీక్షలు చేసేవారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందించేవారు. కంటి సమస్యలు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని తొలి దశలోనే గుర్తించి మెరుగైన వైద్య నిమిత్తం సమీపంలోని ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రులకు పంపేవారు.

8 నెలలుగా నిలిచిన సేవలు

కాంట్రాక్టు సంస్థతో ఉన్న మెమోరాండమ్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) గతేడాది సెప్టెంబరు 4తో ముగిసింది. సేవలను కొనసాగించే నిమిత్తం ఎంఓయూను రెన్యువల్ చేసేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఈఐ కేంద్రాల సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రుల్లోని ఆటోమెటిక్ రిఫ్రాక్టర్ మీటర్, ఫండస్ కెమెరాలు, ఇతర సామగ్రిని అప్పట్లోనే కాంట్రాక్టు సంస్థ తరలించుకుపోయింది. ఈఐ కేంద్రాల గురించి ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి. పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ఈ ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వహణపై కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. 2018లో ఏర్పాటైన ముఖ్యమంత్రి ఈఐ కేంద్రాల నిర్వహణతో పాటు వృద్ధులు, విద్యార్థుల కోసం గ్రామాల్లో, పాఠశాలల్లో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ కేంద్రాల్లో సేవలకు ఆటంకం కలగకుండా కాంట్రాక్టు సంస్థతో ఎంఓయూ గడువును ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేస్తూ వచ్చారు. ఈఐ కేంద్రాల ద్వారా మొత్తంగా 1,30,733 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1,28,358 మందికి రిఫ్రాక్షన్ చెక్స్, 53,102 మందికి ఫండస్ చెక్స్, 90,059 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 884 డీఆర్, 626 గ్లకోమా, 140 మాక్యులర్ డిజనరేషన్, 14,080 కాటరాక్ట్, 76 హైపర్‌టెన్సివ్ రెటినోపతి రోగులను గుర్తించి సంబంధిత వైద్యసేవలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఒక్కో కేంద్రంలో రోజుకు సగటున వంద మందికి పైగా రోగులు వచ్చి కంటి వైద్యసేవలను ఉచితంగా పొందేవారు.

కంటి పరీక్షలు కొనసాగించాలి



గతంలో ఆస్పత్రిలోని ఈఐ కేంద్రంలో, పాఠశాలలు, గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి కంటి పరీక్షలు చేసేవారు. మందులు, కళ్లజోళ్లు ఇవ్వడంతో పాటు శస్త్రచికిత్సలు చేసేవారు. ఇలానే సేవలు అందించేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలి.

– వర్ధనపు సుధాకర్, రుస్తుంబాద

పేదలకు ఇబ్బంది



ఈఐ కేంద్రాల్లో కంటి పరీక్షలు నిలిపివేయడంతో పేదవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో సేవలందక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండటంతో పరీక్షలకు చాలా డబ్బులు ఖర్చవుతున్నాయి.

– కుర్తెళ్ల పౌలు, దుంపగడప, ఆకివీడు మండలం

చెత్త నియంత్రణతో ఆరోగ్యం

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం: చెత్త నియంత్రణ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఈ దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఏర్పాటుచేసిన కంపోస్టు యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్మీ కంపోస్టు తయారీని క్రమపద్ధతిలో నిర్వహించాలని సూచించారు. అనంతరం 14వ వార్డులో జరిగిన ఈ–వేస్టు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు చైతన్యవంతులు, శక్తిమంతులని ప్రభుత్వ స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ–వ్యర్థాలను సక్రమ పద్ధతిలో తొలగించకపోతే ప్రమాదమన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు మాట్లాడుతూ చెత్త నిర్మూలన బాధ్యతగా భావించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

పాలిటెక్నిక్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని కలెక్టర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఉచిత శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీహెచ్‌ఓల నిరసన



నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

భీమవరం(ప్రకాశం చౌక్): వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న సీహెచ్‌ఓలు (ఎన్‌హెచ్‌ఎం) తమ సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జీతభత్యాలకు సంబంధించి పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఏడాదికి 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలంటూ నినదించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ శిరీష, జనరల్ సెక్రటరీ విజయ సీతారామరాజు, సభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు వేగంగా అనుమతులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులను మంజూరు చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను అన్ని శాఖలు నిర్ణీత గడువులోపు పరిశీలించి అనుమతులను మంజూరు చేయాలని సూచించారు. గతనెల 20 నుంచి ఇప్పటివరకు 52 దరఖాస్తులు అందగా 42 దరఖాస్తులను ఆమోదించామన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కింద 19 మందికి వివిధ సబ్సిడీల కింద రూ.27,04,656 మంజూరుకు అనుమతించామన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళిక విడుదల

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా సంభావ్యత రుణ ప్రణాళిక (2025–26) బుక్‌లెట్‌లను కలెక్టర్ సీహెచ్ నాగరాణి శనివారం విడుదల చేశారు. ప్రాధాన్యతా రంగం కోసం మొత్తం అంచనా రూ.23,53,176 లక్షలుగా అంచనా వేశారు. వ్యవసాయ అంచనా రూ.14,87,234 లక్షలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణం అంచనా రూ.6,10,950 లక్షలుగా నిర్ణయించారు. ఎగుమతుల రంగానికి రూ. 27,540 లక్షలు, విద్యారంగానికి రూ.14,005 లక్షలు, గృహ నిర్మాణ రంగానికి రూ.85,477 లక్షలు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ. 4,623 లక్షలు, పునరుత్పాదక శక్తికి రూ.5,856 లక్షలు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.1,17,489 లక్షలుగా అంచనా వేశారు.

పథకం ప్రకారం బీజేపీ ఆరోపణలు

టీడీపీ నేతల ఆగ్రహం

లింగపాలెం: బీజేపీ మండల నాయకులు ఒక పథకం ప్రకారమే విలేకరుల సమావేశం పెట్టి తమపై ఆరోపణలు చేశారని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీజేపీ నేతలు విలేకరుల సమావేశంలో చేసిన విమర్శలపై శనివారం వారు స్పందించారు. మండలంలోని ధర్మాజీగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమిలో భాగమైన బీజేపీకి చెందిన కొందరు నాయకులు టీడీపీ నాయకులపై నిరాధార, అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు, సీనియర్ నాయకుడు గుత్తా సాయి సత్యవరప్రసాద్ (పెదబాబు)లపై రేషన్, మట్టి మాఫియా, సీఎం రిలీఫ్ ఫండ్ విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించడం సరికాదన్నారు. పార్టీ అధిష్టానం అంతర్గతంగా జరిగే అన్ని విషయాలను పరిశీలిస్తుందని, పార్టీ ఆదేశాలను ధిక్కరించేవారిపై కూడా చర్యలు తీసుకోవడానికి వెనకాడబోదని స్పష్టం చేశారు.

జర్మన్ భాషపై శిక్షణ

ఏలూరు (టూటౌన్): బీఎస్సీ నర్సింగ్ జీఎన్‌ఎం పూర్తిచేసిన యువకు 8 నెలలపాటు జర్మన్ భాషపై ఉచిత శిక్షణ, భోజన నివాస సదుపాయాలు కల్పిస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. బి2 లెవిల్ పరీక్ష ద్వారా జర్మనీలో ఉద్యోగావకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 21న గుంటూరులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 90307 44877, 98666 56743 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుల కేటాయింపులో లోపాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూతన పాఠశాలల ఏర్పాటులో ఉపాధ్యాయుల కేటాయింపునకు సంబంధించిన పలు లోపాలను సరిచేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరహరి, ప్రధాన కార్యదర్శి ఎన్వీ రమణయ్య ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి పలు డిమాండ్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు తెలిపామని పేర్కొన్నారు.

పేదల ఇళ్ల తొలగింపు దుర్మార్గం



భీమవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



కాళ్ల మండలం బొండాడలో నిరసన తెలుపుతున్న పేదలు

భీమవరం: ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను తొలగించడానికి అక్కడి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక శాఖను అప్పగించినట్టుగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్ దుయ్యబట్టారు. పేదల ఇళ్ల తొలగింపును నిరసిస్తూ శనివారం భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలిపారు. పాలకోడేరు మండలంలో ఎన్నో ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తుంటే అధికార దురహంకారంతో ఉండి ఎమ్మెల్యే దుర్యోధన పర్వానికి తెరదీశారని మండిపడ్డారు. ఇళ్ల తొలగింపు సందర్భాల్లో భౌతిక దాడుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో పేదలపై దాడులు, దౌర్జన్యాలు తప్ప ఒనగూరిందేమి లేదన్నారు. పాలకోడేరులో పుంత పొడవునా సుమారు 50 సెంట్ల పోరంబోకు భూమిని పెత్తందారులు ఆక్రమించుకుని పొలాల్లో కలిపేసుకున్నారని, వారి జోలికి వెళ్లే దమ్ము ఉండి ఎమ్మెల్యేకు లేదని విరుచుకుపడ్డారు. పేదలపై ప్రభుత్వ వైఖరి ఇలానే కొనసాగితే ప్రభుత్వ పతనం తప్పదని గ్రహించాలన్నారు. సీపీఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

బొండాడలో నిరసన

కాళ్ల: పేదల ఇళ్ల తొలగింపు దారుణమని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని బొండాడ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పోలీసులు స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో ఇంత దారుణానికి ఒడిగట్టడం సరికాదన్నారు. ఇలానే ఇళ్లు కూల్చుకుంటే పోతే రానున్న రోజుల్లో ఉండి నియోజకవర్గం శ్మశానంగా మారుతుందన్నారు. పేదలంటే చులకనగా చూస్తున్న ఎమ్మెల్యేకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అధిక సంఖ్యలో పేదలు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన కోసమే పథకాలు

ఏలూరు (టూటౌన్): అట్టడుగు ప్రజల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. నగరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఉమ్మడి జిల్లాలో పథకాలు అమలుచేసే అధికారులతో సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ సంస్థల సమన్వయంతో పథకాలు అమలు చేసి ప్రజల సంక్షేమం, సమాజాభివృద్ధికి కృషిచేయాలన్నారు. ప్రజలు పథకాలను పొందటంలో న్యాయ సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థలను 08812 22455 లేదా 15100 టోల్ ఫ్రీ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. ఏలూరు ఆర్డీఓ అంబరీష్ మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో తాత్కాలికంగా కొందరికి పథకాలు అందడం లేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. భీమవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ అభ్యర్థులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్తున్నామన్నారు. లీగల్ లేడి చీఫ్ రేగలే డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్వీ మునీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

1.15 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు



సమీక్షిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: జిల్లాలో 249 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకూ 1,15,000 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రబీ 2024–25 గాను జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోలుపై కొనుగోలు కమిటీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రైతుల ఖాతాలలో ధాన్యం సొమ్ములను 48 గంటల సమయంలో జమ చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కోసం కావాల్సిన హమాలీలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఇప్పటివరకూ 59 లక్షల గోనెసంచులను రైతులకు పంపిణీ చేశామన్నారు. పది రోజులకు సరిపడా గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్య కొనుగోలులో సమస్యలు ఉంటే జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 81216 76653కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరులు, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీ నాగరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, తహసీల్దార్లు, మండల వ్యవసాయ, కో–ఆపరేటివ్ అధికారులు, పౌరసరఫరాల డీటీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శనివారం క్రైస్తవులు నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ వసంతమహల్ సెంటర్, జ్యూట్‌మిల్లు, ఓవర్‌బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా ఇండోర్ స్టేడియం వద్దకు చేరింది. ముఖ్య అతిథులుగా ఐసీఎం సంఘాల అగ్రపీఠాధిపతి బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, మన్నా చర్చ్ బిషప్ ఎలీషా రాజు హాజరయ్యారు. రన్ ఫర్ జీసస్ క్రైస్తవ సమాజంలో భాగమైపోయిందని, రాబోయే సంవత్సరాల్లోనూ కొనసాగించాలని బిషప్ జాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం క్రైస్తవుల ఆధ్యాత్మిక జీవితానికి అద్దం పడుతుందని బిషప్ ఎలీషా రాజు అన్నారు. ఇదే క్రమశిక్షణను క్రైస్తవులు నిరంతరం కొనసాగించాలని అమలోద్భవి కథీడ్రల్ గురువులు ఫాదర్ మైఖేల్ ఇంజమాల అన్నారు. శ్యామ్ బాబు, రాజకుమార్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లూథరన్ సంఘ సీనియర్ గురువులు మిల్టన్, పీపీఎస్ కిరణ్, ఎంఎం కుమార్, యు.విలియమ్ కేరీ, పి.శ్యామ్ పాలీనా తదితరులు సందేశాలు అందించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో మానవహారం చేపట్టి డి.యోబు, కె.కిరణ్, జెర్మియా, కె.డేవిడ్ తదితరులు ప్రార్థనలు చేశారు. వందలాది మంది క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

విలీన మండలాల్లో కరెంట్ కష్టాలు

- ఈదురుగాలులతో తరచూ నిలిచిపోతున్న విద్యుత్
- జంగారెడ్డిగూడెం నుంచి సరఫరాలో అవాంతరాలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటున్న ప్రజలు



కుక్కునూరులో 33 కేవీ సబ్‌స్టేషన్

కుక్కునూరు: విలీన మండలాలను విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. వేసవి వచ్చిందంటే విద్యుత్ సమస్యతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంగారెడ్డిగూడెం నుంచి కుక్కునూరు మధ్యలో ఎక్కడ బలంగా గాలులు వీచినా గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో సరఫరా పునరుద్ధరణకు ఎంత సమయం పడుతుందనే విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు.

జంగారెడ్డిగూడెం నుంచి రావాల్సిందే..

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లకు జంగారెడ్డిగూడెంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కుక్కునూరు మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా కావాలంటే జంగారెడ్డిగూడెం నుంచి మైసన్నగూడెం, ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం, వేలేరుపాడు గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల నుంచి రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఈ మధ్యలో ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది ఏర్పడినా విలీన మండలాల ప్రజలు చీకట్లలో మగ్గాల్సిందే.

అటవీ ప్రాంతం కావడంతో..

జంగారెడ్డిగూడెం నుంచి కుక్కునూరుకు సుమారు 100 కిలోమీటర్ల దూరం. ములగలంపల్లి నుంచి కుక్కునూరు మధ్య అటవీ ప్రాంతం మీదుగా విద్యుత్ లైన్లు ఉన్నాయి. అటవీ ప్రాంతం కావడంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతుండటంతో విద్యుత్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పనిసరి

కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు తెలంగాణ నుంచి ఆంధ్రా విలీనమైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్య తీవ్రంగా మారింది. దీనిపై పలుమార్లు ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. అల్లూరి జిల్లాలోని ఎటపాక 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి గోదావరి మీదుగా టవర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌ను అందించాలని, లేకుంటే వేలేరుపాడు మండలంలోని మేడిపల్లి వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఆ దిశగా అధికారులు కూడా సర్వే చేసినా ఏదీ కార్యరూపం దాల్చలేదు.

లోఓల్టేజీ సమస్య



తెలంగాణలో ఉన్నప్పుడు సమస్య వస్తే బూర్గంపాడు నుంచి లేకపోతే అశ్వారావుపేట నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి లోఓల్టేజీ సమస్య వేధిస్తోంది. ఇప్పటికీ మా ఊరిలో లోఓల్టేజీతో గృహోపకరణాలు సరిగా పనిచేయడంలేదు. దీనిపై గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసినా ఫలితం లేదు.

– నకిరికంటి వెంకటేశ్వర్లు, కొండపల్లి, కుక్కునూరు

గంటల తరబడి అంతరాయం



వేసవి కాలం వచ్చిందంటే విద్యుత్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. గడిచిన వారం రోజుల్లో కూడా రాత్రి మొత్తం విద్యుత్ సరఫరా లేక పిల్లాపాపలతో చాలా ఇబ్బంది పడ్డాం. పోలవరం ప్రాజెక్టు పేరుతో మా మండలాలను విలీనం చేసుకుని మా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.

– పేరాల నరసింహారావు, కొండపల్లి, కుక్కునూరు

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఉత్తర్వులు

భీమవరం: జిల్లాలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు 2025–26 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. పిల్లలకు ఐదేళ్లు నిండి ఉండాలని, ఈనెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్, జాబ్ కార్డు, విద్యుత్ బిల్లులో ఏదో ఒకటి సమర్పించాలని, అలాగే పిల్లల పుట్టినతేదీ ధ్రువపత్రం జమచేయాలన్నారు.

కూలి డబ్బుల కోసం ధర్నాలు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలంటూ ఈనెల 21, 22 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నట్టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు సుమారు రూ.49.83 కోట్లు, ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకూ రూ. 11.56 కోట్లు బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వాహన దొంగల అరెస్టు


చోరీ సొత్తు, నిందితులతో పోలీసు సిబ్బంది

కై కలూరు: వాహనదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న దొంగలను కలిదిండి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కలిదిండి పోలీసు స్టేషన్‌లో రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, ఎస్సై వి.వెంకటేశ్వరరావు కేసు వివరాలు వెల్లడించారు. పేట కలిదిండికి చెందిన వనమాల జగదీష్(31), కలిదిండికి చెందిన చేబోయిన శ్యాంతేజా(28) ఇటీవల ఈ ప్రాంతంలో 5 వాహనాలను దొంగతనం చేశారు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు ఎట్టకేలకు వీరిని అదుపులోకి తీసుకుని మొత్తం వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన ఎస్సై వి.వెంకటేశ్వరరావు, ఏఎస్సై కె.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లు బి.రమేష్, డి.వడ్డీ కాసులు, హోంగార్డు కట్టా శ్రీనులను సీఐ రవికుమార్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

భీమవరం: మోటారుసైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందాడు. భీమవరం టూటౌన్ ఎస్సై ఇజ్రాయిల్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న రాజమహేంద్రవరానికి చెందిన ఎం జ్ఞానసాగర్(21) శుక్రవారం రాత్రి తన స్నేహితుడు కె సాయిభరత్‌తో కలసి గరగపర్రు రోడ్డులోని తన రూమ్ నుంచి మోటారు సైకిల్‌పై పట్టణంలోకి వచ్చారు. పని ముగించుకుని తిరిగి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్‌ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జ్ఞానసాగర్ తలకు తీవ్ర గాయాలు కాగా సాయిభరత్‌కు స్వల్పగాయలయ్యాయి. వెంటనే వైద్యం కోసం ఆసుపత్రికి తరలించగా జ్ఞానసాగర్ మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. సాయిభరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

పురుగు మందు తాగి..

పెనుగొండ: అనారోగ్యంతో మనస్తాపానికి గురై ఆచంట శివారు బాలం వారి పాలెంకు చెందిన వేండ్ర శ్రీను (49) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేండ్ర శ్రీను గత కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నాడు. దీనికి తోడు కుమార్తె సైతం మానసిక వ్యాధితో బాధ పడుతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో శనివారం కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కలుపు మందు తాగడం గమనించిన భార్య కుమారుడుకు చెప్పడంతో హుటాహుటిన శ్రీనుని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డ్యూటీ డాక్టర్ పరీక్షించి శ్రీను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువు వేండ్ర మురళీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఆచంట ఎస్సై కేవీ రమణ తెలిపారు.

ఆ ఊరంతా నారసింహులే..

- పుట్టిన ప్రతి బిడ్డకూ నరసింహ నామకరణం
- నరసింహమూర్తి, నరసమ్మల పేర్లే అధికం
- ఒకే పేరుతో ఎక్కువ మంది ఉండటంతో నంబర్లతో పిలుపు
- ఐఎస్ జగన్నాథపురంలో అదే ప్రత్యేకత
- లక్ష్మీనరసింహ స్వామివారే ఆ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం


నరసింహమూర్తి, నరసయ్య పేర్లు గలవారు


ఆలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు

సండే స్పెషల్

ద్వారకాతిరుమల: ఆ ఊరిలో వెలసిన నారసింహుడంటే వారికెంతో నమ్మకం. ఆ ఊరిలో మగబిడ్డ పుట్టినా.. ఆడ బిడ్డ పుట్టినా.. ఆ స్వామివారి పేరు పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. ఆ ఊరిలో ఏ గడప తొక్కినా.. నరసింహ, నరసయ్య, నరసింహమూర్తి, నరసింహస్వామి, లక్ష్మీనరసమ్మ, నరసమ్మ వంటి పేర్లే వినిపిస్తాయి. ఇప్పటికే నరసింహమూర్తి పేరుగల వారు ఎక్కువ మంది ఉండటంతో కొంత మందిని నంబర్లతో పిలుస్తున్నారు. ఇదే ఈ ఊరి ప్రత్యేకత. ఇక్కడ ఏ ఇంట శుభకార్యం జరగాలన్నా ముందు ఆ స్వామిని దర్శించి, పూజలు జరుపుకుంటారు. ఆ తరువాతే అడుగు ముందుకు వేస్తారు. ఎన్నికల సమయాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ ఊరి నుంచే ప్రచారాలను మొదలు పెడతారు. ఎందుకంటే ఈశాన్యం మూల ఉన్న ఊరు ఇది.. అందులోనూ నారసింహుని సన్నిధి నుంచి ప్రచారం మొదలు పెడితే ఇక తిరుగు ఉండదన్న నమ్మకం వారిది. అందరికీ అంత సెంటిమెంట్ ఆ స్వామివారంటే. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురం గ్రామం నారసింహుని క్షేత్రంగా విరాజిల్లుతోంది. సుమారు వెయ్యి మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో, రెండు వందల మందికి పైగా స్వామివారి పేరుగల వారు ఉన్నారంటే అతిశయోక్తికాదు.

నామకరణం వెనుక చరిత్ర ఇదీ..

సుమారు వందేళ్ల క్రితం అప్పటి ఠాణేదారు అయిన లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొచ్చర్లకోట రామారావు, జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెంది గూడూరు అయ్యన్న, బెల్లన్న అరణ్యప్రాంతమైన ఈ మార్గం గుండా వెళుతున్నారు. కొందరు పశువుల కాపర్లు కొండపైన ఏదో ఉందని, అప్పుడప్పుడు పశువుల కోసం కూత వేస్తుంటే తిరిగి కూత వినిపిస్తోందని వారికి చెప్పారు. దాంతో వారు డొంకలు నరుక్కుంటూ కొండపైకి చేరుకుని అక్కడ స్వయంభూ నరసింహ స్వామిని గుర్తించి పాల పొంగలిచేసి స్వామివారికి నివేదించారు. ఆ వెంటనే మండు వేసవి రోజున వర్షం కురిసింది. దాంతో స్వామివారు ఎంతో మహిమాన్వితుడని రామారావు నమ్మారు. తనకు సంతానం లేకపోవడంతో స్వామివారిని మొక్కుకున్నారు. దాంతో ఆయనకు కలిగిన మొదటి సంతానమైన కుమారుడికి స్వామివారి పేరు పెట్టుకుని, ఇలవేల్పుగా కొలిచారు. ఆ తర్వాత ఆయన మనుమడికి సైతం కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహం అని పేరు పెట్టారు. ఇప్పుడు ఆయనే గురూజీగా ప్రతి ఏటా శివరాత్రి నాడు ఈ నారసింహుని క్షేత్రంలో మహా యజ్ఞాన్ని నిర్వహిస్తూ, స్వామివారి కీర్తిని చాటుతున్నారు.


సుందరగిరిపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం


ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం

తికమక పడకుండా

నరసింహమూర్తి పేరుగల వారు ఎక్కువ మంది ఉండటంతో పిలిచేవారు అలాగే పలికేవారు తికమక పడేవారట. దాంతో వారు చదువుకునే రోజుల్లో ఉపాధ్యాయులు కొంత మంది నరసింహమూర్తులకు నంబర్లు పెట్టారు. ఒకటి గాడు, రెండు గాడు, మూడు గాడు ఇలా పది నంబర్ల వరకు పెట్టారు. క్లాస్‌కి వచ్చే ఉపాధ్యాయులు ఏరా.. ఒకటి గాడు వచ్చాడా.. రెండు గాడు వచ్చాడా.. అని పిలిచేవారట. ఇప్పటికీ గ్రామంలో వారిని ఆ నంబర్లతోనే పిలుస్తుండటం విశేషం.

ప్రతి ఇంట్లోనూ నారసింహుని పేరుతో..



నా పేరు పసుపులేటి నరసింహమూర్తి. నా కుమార్తెకు కూడా నరసమ్మ అని పేరుపెట్టాను. ఆ లక్ష్మీనరసింహ స్వామివారిని మదినిండా నింపుకున్నాం. అందుకే మా గ్రామంలో దాదాపు ప్రతి ఇంట్లోనూ నారసింహుని పేరుగల వారు ఉంటారు.

– పసుపులేటి నరసింహమూర్తి

ఎక్కడా ఇలా లేదు



ఎన్నో గ్రామాల్లో క్షేత్రాలు ఉన్నాయి. కానీ ఎక్కడా దేవుళ్ల పేరును ఇంతిలా పెట్టుకున్న వారు లేరు. నరసింహమూర్తి అనే పేరు ఎంత మందికి ఉన్నా.. ఇంకా పుడుతున్న బిడ్డలకు ఆ పేరునే పెట్టుకుంటున్నారంటే ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కొందరు ఆడపిల్లలకు నర్సవేణి, నరవల్లి పేర్లు కూడా పెడుతున్నారు. అందుకే ఈ గ్రామ ప్రజలపై స్వామివారి కృపా కటాక్షాలు ఉంటున్నాయి.

– కోడూరి ఈశ్వర శర్మ, లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు

నంబర్‌తో పిలిచేవారు



మా గ్రామంలో హైస్కూల్ లేకపోవడంతో రాజవరంలోని పాఠశాలకు వెళ్లి చదువుకునే వాళ్లం. మా గ్రామం నుంచి వెళ్లిన వారిలో ఎక్కువ మంది నరసింహమూర్తి పేరు గల వారం ఉండేవారం. దాంతో ఉపాధ్యాయులు ఒకటి, రెండు, మూడు ఇలా పది మందికి నంబర్లు పెట్టారు. అటెండెన్స్ వేసే టప్పుడు కూడా ఒకటి గాడు వచ్చాడా.. రెండు గాడు వచ్చాడా.. అని పిలిచేవారు. నా నంబర్ ఏడు కాబట్టి నన్ను ఏడు గాడు వచ్చాడా అని పిలిచేవారు.

– పసుపులేటి నరసింహమూర్తి

ఆనవాయితీగా మారింది



లక్ష్మీనరసింహ స్వామివారి పేరును పిల్లలకు పెట్టడం ఈ గ్రామంలో ఆనవాయితీగా మారింది. ఆ క్రమంలోనే నా తల్లిదండ్రులు నాకు నరసమ్మ అని పేరు పెట్టారు. లక్ష్మీనరసింహ స్వామివారిపై ఉన్న భక్తి, నమ్మకంతో ఆయన పేరును నామకరణం చేస్తున్నారు. ఆ స్వామి పేరులోనే ఏదో మహత్యం ఉంది.

– బోయిన నరసమ్మ

నా మనుమరాలికి కూడా స్వామి పేరే పెడతా..



నా తండ్రి పేరు నరసయ్య, నా భార్య పేరు లక్ష్మీ నరసమ్మ, నా కుమార్తె పేరు నాగవెంకట నరసమ్మ. నా మనుమరాలికి మరి కొద్దిరోజుల్లో పేరు పెట్టాల్సి ఉంది. ఆమె పేరు కూడా స్వామివారి పేరే పెడతాను. నా పేరుగల వారు ఎక్కువ మంది ఉండటంతో గ్రామంలో నన్ను ఒకటి గాడు అని పిలుస్తారు.

– ముత్తింటి నరసింహమూర్తి

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు


అనివేటి మండపంలో కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల దివ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలు వెలువడటంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. భక్తులతో ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట తదితర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. వకుళమాత నిత్యాన్నదాన భవనం వద్ద ఉచిత అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. పార్కింగ్ ప్రదేశాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

మా రొయ్యను మేమే అమ్ముకుంటాం

- డొమెస్టిక్ సేల్స్ కౌంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఏర్పాట్లు చేస్తున్న జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం


ఆక్వా డొమెస్టిక్ సేల్స్ కొరకు స్థలాన్ని పరిశీలిస్తున్న క్షీరారామ ఆక్వా సంఘం సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రోడ్డెక్కినా ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో రైతులు తమ పంటను తామే విక్రయించుకోవాలనే సంకల్పంతో డొమెస్టిక్ సేల్స్ కౌంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనికోసం శనివారం పాలకొల్లు జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు ఆధ్వర్యంలో పూలపల్లి బైపాస్ రోడ్డు నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే మార్గ మధ్యలో ఓ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ సెక్రటరీ బోణం చినబాబు మాట్లాడుతూ ప్రాసెసింగ్ ప్లాంట్‌లపై ఆధారపడి ఇప్పటివరకూ ఆక్వా రైతులు చాలా నష్టపోయారన్నారు. డొమెస్టిక్ సేల్స్ కేంద్రం ఇటు వినియోగదారుడు, అటు ఆక్వా రైతుకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అలాగే కొందరు మహిళలకు ఉపాధి కూడా కల్పించినట్లు అవుతుందన్నారు. ఈ నెల 30 వ తేదీన శంకుస్థాపన చేస్తామని, అనంతరం మూడు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పక్కాగా ప్రారంభోత్సవం చేయాలనే సంకల్పంతో తమ సంఘం ఉందన్నారు. ప్రారంభం అయిన వెంటనే ఇక్కడ రూ.100కు రొయ్యలను అందజేస్తామన్నారు. అంతా రెడీ కుక్‌లా ప్యాకింగ్‌లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా రైతు 100 కౌంట్‌కు కొద్దిగా ఎక్కువ తక్కువ ఉన్న సమయంలో నేరుగా ఈ కౌంటర్ వద్దకు తీసుకువచ్చి తన రొయ్యను విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. లోకల్ సేల్స్ పెరిగిందంటే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసే కౌంటర్ మిగిలిన రెండు నియోజకవర్గాల్లో కూడా అమలైందంటే ఈ కార్యక్రమం విజయవంతమైనట్లేనని అన్నారు. ఆక్వా సంఘ సభ్యులు మేడిది జాన్‌రాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌ఫ్రైడే వేడుకల్లో అపశ్రుతి

పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగి ఒకరి మృతి


సంకెళ్ల ఉదయ్‌కుమార్ మృతదేహం

నరసాపురం రూరల్ : క్రైస్తవ సోదరులు ఎంతో పవిత్రంగా భావించి జరుపుకునే గుడ్‌ఫ్రైడే వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పేరుపాలెం బీచ్‌లో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. 40 రోజుల ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వాసులు పేరుపాలెం తీరంలోని వేళాంకణ్ణి మాత ఆలయం వద్ద మాల విరమణ చేసేందుకు శుక్రవారం రాత్రినుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఇందులో శనివారం వేకువ జామున సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులు సముద్రపు అలలకు ఉక్కిరి బిక్కిరై ఒడ్డుకు ప్రాణాలతో కొట్టుకు వచ్చారు. వీరిలో నల్లజర్ల మండలం ప్రకాశపాలెంకు చెందిన సంకెళ్ల ఉదయ్‌కుమార్ (19) అనే యువకుడిని స్థానికులు, పోలీస్ సిబ్బంది మొగల్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉండటంతో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉదయకుమార్ తండ్రి చిన్న తనంలోనే మృతి చెందగా తల్లి విజయలక్ష్మి బిడ్డను చూసుకుంటోంది. ఈ ఘటనపై మృతుడి అక్క విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొగల్తూరు 2వ ఎస్సై వై నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇదే ప్రమాదంలో బయట పడిన మరో వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో కుటుంబ సభ్యులు భీమవరంలో చికిత్స చేయించి సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం. అ వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

జేఈఈ మెయిన్స్‌లో శశి వేలివెన్ను విజయభేరి


విద్యార్థులతో శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో మరోసారి సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శనివారం తెలిపారు. ఆలిండియా స్థాయిలో వివిధ కేటగిరీల్లో జి.అనూప్‌రాజ్ 26, డి.మణికంఠరెడ్డి 63, ఎ.శివరామ్ 142, బి.నిఖిల 159, ఏఎల్ జ్ఞాన ప్రకాష్ 168, కె.జైకిశాన్ 225, కె.ఆనంద్ 266, ఎం.సాయి కిరణ్ 292, పి.సుకుమార్ 363, పీవై సుందరరెడ్డి 436, డి.శర్వాన్ 448, ఐ.రామచరణ్ 477, కె.శివ సత్యదేవ్ 543, సీహెచ్ యశస్విని 623, షేక్ అబ్దుల్ వహాబ్ 671, కె.ఆనంద్‌పాల్ 756, కె.ఉజ్వల్ కిరణ్ 859, కె.చరణ్‌దీప్ 871, బి.చైతన్య 913 ర్యాంకులు సాధించారని వివరించారు. 100 లోపు ఇద్దరు, 500 లోపు 12 మంది, 1,000 లోపు 19 మంది, 5,000 లోపు 58 మంది, 10,000 లోపు 101 మంది, 15,000 లోపు 134 మంది, 20,000 లోపు 161 మంది, 30,000 లోపు 219 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని విద్యా సంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

శ్రీషిర్డీసాయి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీన్ చంద్రశేఖర్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ఫలితాల్లో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఈ విషయాన్ని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శనివారం విలేకరులకు తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న శ్రీసాయి హిమ్నిష్ జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు సాధించాడన్నారు. సీహెచ్ మోక్షిత్ 35, ఎం.మధులిక రెడ్డి 169, మోహన్ శ్రీరామ్ జీ 287 ర్యాంకులు కైవసం చేసుకుని అత్యుత్తమ ప్రతిభ కనపరచారన్నారు. మొత్తం 10 మంది విద్యార్థులు 1000 లోపు ర్యాంకులు సాధించగా, 23 మంది 2,000 లోపు, 45 మంది 5,000 లోపు, 64 మంది 10,000 లోపు, 88 మంది 20,000 లోపు ర్యాంకులు సాధించినట్లు శ్రీవిద్య వివరించారు. మొత్తం 245 మంది విద్యార్థులు హాజరుకాగా 186 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ ఏటా తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

ఒలింపియాడ్‌లో 29 మంది విద్యార్థులకు ర్యాంకులు


ప్రశంసా పత్రాలు అందుకున్న పెదతాడేపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ సంస్థ (గురుగ్రామ్) వారు నిర్వహించిన గణిత, ఇంగ్లీష్, సైన్స్, సోషల్, జనరల్ నాలెడ్జ్ పరీక్షల్లో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ బి.రాజారావు శనివారం తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 30 మందికి గాను ఐదుగురు, ఇంగ్లీష్ పరీక్షలో 20 మందికి గాను ముగ్గురు, సైన్స్ పరీక్షలో 62 మందికి గాను 12 మంది, జనరల్ నాలెడ్జ్‌లో ముగ్గురికి ముగ్గురు ఇంటర్నేషనల్, సోషల్ విభాగంలో 34 మందికి గాను ఆరుగురు ఇంటర్నేషనల్ ర్యాంకులతో పాటు జోనల్, క్లాస్ ర్యాంకులు, గోల్డ్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. సైన్స్ ఒలింపియాడ్‌లో రోషన్ (ఏడవ తరగతి), పృధ్వీ (8వ తరగతి), చిగురుపల్లి వివేక్ (9వ తరగతి), పిట్టా తంబి, అరవింద్ సాగర్‌బాబు (10వ తరగతి) మొదటి ర్యాంకులు సాధించారన్నారు. అలాగే ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో కంకిపాటి శాండీ రేవంత్ (8వ తరగతి) మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 29 మంది ప్రతిభ కనబర్చారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయాధికారిణి బి.ఉమాకుమారి, ప్రిన్సిపాల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు నూజివీడులో బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు: నూజివీడులోని వీటీహెచ్ గ్రౌండ్‌లో ఈనెల 20న ఉదయం 7 నుంచి బాస్కెట్‌బాల్ ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ సుభాష్ చంద్రబోస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాన్ని, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, స్టాంపు సైజు ఫొటోలు తదితర వాటిని తీసుకొని రావాలన్నారు. సబ్‌జూనియర్ విభాగంలో పాల్గొనేందుకు 2012 జనవరి ఒకటి తరువాత జన్మించిన వారు, జూనియర్ విభాగంలో పాల్గొనేందుకు 2008 జనవరి ఒకటి తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపిక చేసిన జట్లు మే నెల 15 నుంచి 18 వరకు చిత్తూరులో నిర్వహించే 8వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ నందు, అలాగే జూన్ నెలలో నిర్వహించే 10వ ఏపీ స్టేట్ జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఇది అతని సంతకం' నాటిక


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో కళారంజని నాటక అకాడమీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన 14వ జాతీయస్థాయి నాటిక పోటీల్లో గుంటూరు వారి అభినయ ఆర్ట్స్ 'ఇది అతని సంతకం' నాటిక ప్రథమ బహుమతిని గెల్చుకుంది. అంతేకాకుండా ఈ నాటిక నుంచే ఉత్తమ నటనకు, దర్శకత్వానికి ఎస్ రవీంద్రరెడ్డికి ఉత్తమ సంగీతానికి లీలామోహన్ బహుమతులు అందుకున్నారు. విజేతల వివరాలను న్యాయనిర్ణేతలు గంటా రామ్మోహనరావు, అల్లు రామకృష్ణ, గంటా ముత్యాలరావునాయుడు శనివారం విలేకర్లకు తెలిపారు. ఉత్తరాంధ్ర సౌజన్య కళాప్రవంతి వారి దేవరాగం నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా బహుమతి అందుకుంది. ఉత్తమ నటనకుగాను బీఎస్ఎస్ శివ (దేవరాగం), వరప్రసాద్ (అనస్వరం), మంజునాథ్ (హక్కు), జ్యోతిరాణి (దేవరాగం), బహుమతులు గెల్చుకోగా ఉత్తమ రచనకు దేవరాగం నాటికి రచయిత కేకేఎల్ స్వామి, ఉత్తమ ఆహార్యం తితిక్ష నాటిక, ఉత్తమ రంగాలంకరణ తితిక్ష నాటికకు టి బాబురావు బహుమతులు అందుకున్నట్లు న్యాయనిర్ణేతలు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో కళారంజని నాటక అకాడమీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జవ్వాది దాశరథి శ్రీనివాస్, మెంటే పూర్ణచంద్రరావు, గుండా రామకృష్ణ, మల్లుల సీతారామ్‌ప్రసాద్, పులగం శివనాగనర్సింహరావు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మరణం వెనుక నిజం తెలియాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాస్టర్ ప్రవీణ్ పోస్టుమార్టమ్ నివేదిక బయటపెట్టి ఆయన మరణం వెనుక నిజం ఏమిటో ప్రజలకు తెలియజేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకిటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ మృతికి లభించిన అన్ని ఆధారాలను పోలీసులు బహిర్గతం చేయాలన్నారు. ఈ కేసును సీబీఐకు అప్పగించాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని రాజమండ్రి సమీపంలో డెత్ స్పాట్ దగ్గరకు క్రైస్తవులు, అభిమానులు నివాళులర్పించేందుకు వెళుతుంటే పోలీసులు అడ్డుతగిలి అరెస్టు చేయడం సరికాదని ఖండించారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి హామీ పని ప్రాంతాన్ని సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లింగారాయుడిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి ఇప్పటి వరకు కూలి బకాయిలు రాలేదని, బకాయిలు చెల్లింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉంటే కూలీలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వెంటనే కూలి బకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలు కొనకళ్ల వరలక్ష్మి, కట్టా గోవర్ధన, గరగ అనిత, కాళ్ల సీత తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ఆంధ్రా సుగర్స్‌లో అవగాహన



సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో మునిసిపల్ కమిషనర్, ఆంధ్రా సుగర్స్ ప్రతినిధులు

తణుకు అర్బన్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. గృహాల్లో ఉపయోగించకుండా మూలనపెట్టిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, డీవీడీ ప్లేయర్లు వంటి సామగ్రిని సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహనం ద్వారా సేకరించి తణుకు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ద్వారా వెండర్‌కు అందజేసినట్లు సంస్థ జనరల్ మేనేజరు (హెచ్ ఆర్) ఎ.సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్ జి.రంగారావు, అసిస్టెంట్ జనరల్ మేనేజరు పి.శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం



భవిత కేంద్రంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: మండల స్థాయిలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ, మానవహారం, ఎస్‌ఏఎస్‌పి ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక అధికారి వీవీ నాగ రాజారావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణం నాశనం అవుతుందని, పర్యావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు హైమావతి సత్య



హైమావతి సత్య, కవి, రచయిత

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కవి, రచయిత హైమావతి సత్యకు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం అందింది. మే నెల 10, 11 తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరు మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొంటారని, ఈ వేడుకల్లో పాల్గొనాలంటూ శ్రీశ్రీ కళావేదిక సీవో కత్తిమండ ప్రతాప్ నుంచి ఆహ్వానం అందినట్లు హైమావతి సత్య తెలిపారు.

స్టీలు కంచాల పంపిణీ



విద్యార్థులకు స్టీలు కంచాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మండలంలోని గూట్లపాడు, కొత్త పూసలమర్రు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు స్టీల్ కంచాలు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భూపతి రాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు గ్రంధి కుమార వెంకటేశ్వర వర ప్రసాద్ మాట్లాడుతూ విద్యతోనే పేద, మధ్య తరగతి కుటుంబాల స్థితిగతులు పూర్తిగా సమసిపోతాయని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యం

- అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నేటితో ముగియనున్న వారోత్సవాలు
- ప్రమాదాల్లో రూ.8.06 కోట్ల ఆస్తిని కాపాడిన వైనం



తణుకులో అగ్నిమాపక వారోత్సవాల్లో అగ్నిమాపక కేంద్రంలోని పరికరాల పనితీరును తెలుపుతున్న అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్ (ఫైల్)



అత్తిలిలో అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి గంగరాజు (ఫైల్)

తణుకు అర్బన్: వేసవి వస్తుందంటే చాలు ఏ ప్రాంతంలో ఏ అగ్నిప్రమాదం సంభవిస్తుందోనని ప్రజానీకంతోపాటు అగ్నిమాపక యంత్రాంగం కూడా బెంబేలెత్తిపోతుంటారు. అయితే మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాలు కొన్నైతే ప్రమాదవశాత్తూ జరిగేవి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లతో జరిగే ప్రమాదాల్లో ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం కూడా జరుగుతుండడం పరిపాటిగా ఉంటాయి. నియోజకవర్గంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలే అధికంగా కనిపిస్తున్నాయి. అయితే ప్రతి ఏడాది వేసవి వస్తుందంటే చాలు అగ్నిప్రమాదాల సంకేతాలు వినిపిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ముంబాయిలో ఒక ఓడలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓడలో ఉన్న వారిని కాపాడే క్రమంలో ప్రయాణికులతో పాటు 66 మంది అగ్నిమాపక సిబ్బంది అసువులు బాశారు. ఈ ఘటనకు స్మారకంగా అదే రోజును అగ్నిమాపక సేవా దినోత్సవంగా గుర్తించి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ‘అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి’ అనే నినాదంతో అగ్నిమాపక శాఖ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ప్రమాదాలపై అవగాహన ఇలా..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి తణుకు, అత్తిలిలో రెండు అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ రెండు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో అగ్నిమాపక శాఖ అధికారులు ఈ వారం రోజులపాటు వారోత్సవాల్లో కర్మాగారాలు, బహుళ అంతస్థుల భవనాలు, హోటల్స్, లాడ్జిలు విద్యాసంస్థల భవనాలు, ఆస్పత్రుల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా మంటలు చెలరేగిన సందర్భాల్లో ప్రమాదాన్ని ఏరకంగా నివారించాలి, వంట గ్యాస్ సిలిండర్లు ప్రమాదాల్లో ఎలా స్పందించాలి, ఏం చేయాలనేది పూర్తిస్థాయిలో వివరిస్తున్నారు. అగ్ని ప్రమాదాలతో పాటు ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కూడా అగ్నిమాపక సిబ్బంది అందజేస్తున్న సేవలు అజరామజరంగా నిలుస్తున్నాయి.

స్టేషన్	సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	నష్టం	సేవ్ చేసింది
తణుకు	2022–23	69	రూ.1,76,45,000	రూ. 3,42,53,000
అత్తిలి	2022–23	27	రూ.20,92,000	రూ. 79,80,000
తణుకు	2023–24	80	రూ. 54,06,000	రూ. 1,12,44,000
అత్తిలి	2023–24	21	రూ. 11,35,000	రూ. 52,65,000
తణుకు	2024–25	77	రూ. 44,05,000	రూ. 1,14,55,000
అత్తిలి	2024–25	37	రూ. 25,93,000	రూ.1,04,45,000

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు

- గ్యాస్ సిలిండరు మార్చినప్పుడు తప్పనిసరిగా ట్యూబును పరిశీలించాలి. చీలికలు ఉన్నా, పాడైయినా మార్చుకోవాలి.
- గ్యాస్ స్టవ్‌ను ఎత్తుగా ఉన్న ప్లాట్‌ఫామ్‌పై ఉంచుకోవాలి. స్టవ్ వాడకం పూర్తైతే రెగ్యులేటర్ వాల్‌ను ఆపివేయాలి.
- గ్యాస్ స్టవ్ వెలిగించి ఇతర పనులకోసం బయటకు వెళ్లకూడదు.
- గ్యాస్ లీక్ అయినట్లుగా అనిపిస్తే వెంటనే రెగ్యులేటర్‌ను ఆపివేయాలి. ఆసమయంలో విద్యుత్ లైట్లు ఆపరాదు, వేయరాదు.
- వంటగదిలో పెట్రోలు, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండరును ఉంచరాదు.
- ప్రమాదవశాత్తూ ఒంటిపై దుస్తులకు నిప్పంటుకుంటే భయంతో పరిగెత్తకుండా నేలపై దొర్లడం, దుప్పటి చుట్టుకోవడం చేయాలి.
- పొగతో నిండిన గదుల్లోంచి మోచేతులు, మోకాళ్లపై పాకుతూ బయటపడాలి.
- అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు లోపల నుంచి ఆరుబయటకు వచ్చేయాలి.
- అపార్టుమెంట్‌లలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్ల మార్గంలో కిందికి రావాలి.
- విద్యుత్ పరికరాల్లో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు నీటితో మంటలు ఆర్పరాదు. ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి.
- గృహాల్లో ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్లి ఉండాల్సిన సందర్భాల్లో ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి.
- కర్మాగారాలు, అపార్టుమెంట్‌లు, ఆస్పత్రులు, పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఫైర్ ఎవాక్యుయేషన్ డ్రిల్‌ను ప్రతి మూడు నెలలకోసారి క్రమం తప్పకుండా ప్రాక్టీసు చేయాలి.
- మూడేళ్లలో 311 ప్రమాదాలు.. ఆస్తి నష్టం రూ. 3.32 కోట్లు...
- నియోజకవర్గంలోని రెండు అగ్నిమాపక కేంద్రాల్లోను గడిచిన మూడు సంవత్సరాల్లో 311 ప్రమాదాలకుగాను రూ. 3.32 కోట్లు ఆస్తి నష్టం సంభవించగా రూ.8.06 కోట్లు ఆస్తిని కాపాడినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ మూడు ఏళ్ల కాలంలో వివిధ ప్రమాదాల్లో మొత్తం 10 మంది మృత్యువాత పడినట్లు తెలుస్తోంది.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం



అగ్నిప్రమాదాల నివారణతో పాటు వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశ్యంతో అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వారోత్సవాల్లో భాగంగా ప్రజలు, పలు వ్యవస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈనెల 14వ తేదీ నుంచి విద్యాసంస్థలు, కర్మాగారాలు, అపార్టుమెంట్‌లు, ప్రభుత్వ ఆస్పత్రులు, పెట్రోలు బంకుల్లోను అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు ప్రమాదాలు చోటుచేసుకున్న పరిస్థితుల్లో ఎలా నివారించాలనే అంశాలపై పూర్తిగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ వేసవిలో ఎటువంటి ప్రమాదం సంభవించినా ఎదుర్కునేందుకు సిద్ధంగానే ఉన్నాం. – ఐ.అజయ్‌కుమార్, తణుకు అగ్నిమాపక కేంద్ర అధికారి


గోపినాథపట్నం శివాలయంలో విశేష పూజలు



గోపినాథపట్నంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రికొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాధపట్నం గ్రామంలో శ్రీభ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈనెల 23 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్ల ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నూతనంగా నిర్మించిన శివాలయంలో వినాయక స్వామి, కుమారస్వామి, ధ్వజస్తంభం, శిఖర, సహిత శ్రీభమరాంభసమేత ప్రతిష్ఠా పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు సత్యానారాయణ, సాదిని కుమారి దంపతులు ఈపూజలు శనివారం నిర్వహించారు. శాంతి మంత్ర పఠనం, గణపతి పూజ, గోపూజలు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, సంపత్ కుమార్, కైకాల శ్రీను, పెంటపాడు మండల వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షుడు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన గుమ్మంపాడు లాకుల తలుపులు



శిథిలావస్థకు చేరిన తలుపులతో నీరు కింద భాగానికి వెళ్తున్న దృశ్యం

ఆధునికీకరించాలని కోరుతున్న రైతాంగం

అత్తిలి: మండల ప్రజలకు తాగు, సాగునీరు అందజేసే అత్తిలి కాలువపై ఉన్న గుమ్మంపాడు లాకులు శిథిలావస్థకు చేరింది. అత్తిలి కాలువ నుంచి బ్రాంచ్ కెనాల్స్‌ద్వారా మండల పరిధిలో గ్రామాలకు సాగునీరు సరఫరా అవుతోంది. గుమ్మంపాడు లాకుల వద్ద పడవల వెళ్లే మార్గంలో గేట్లు శిథిలావస్థకు చేరడంతో నీరు క్రిందకు వెళుతోంది. గుమ్మంపాడు లాకుల వద్ద ఉన్న గేట్లు తుప్పుపట్టి రంధ్రాలు పడటంతో నీరు ధారాళంగా కాలువ దిగువ భాగానికి వెళుతోంది. శిథిలావస్థకుచేరిన గేట్ల తలుపులు తొలగించి కొత్త తలుపులు ఏర్పాటుచేయడం ద్వారా సాగునీరు అన్ని ప్రాంతాలకు సక్రమంగా సరఫరా చేసే అవకాశం కల్గుతుంది. అత్తిలి కాలువపై పలు స్లూయిజ్ గేట్లు కూడా శిథిలావస్థకు చేరడంతో నీరు స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు వెళుతోందని, దీని వల్ల వంతుల వారీ విధానంలో సాగునీరు సరఫరా చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన లాకుల తలుపులను తొలగించి ఆధునికీకరించాలని రైతులు కోరుతున్నారు.


పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పెదతాడేపల్లి గ్రామంలో ఈ-వేస్ట్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ అన్నవరం

తాడేపల్లిగూడెం రూరల్: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చని సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెదతాడేపల్లిలో ఈ-వేస్ట్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. అయితే, ఈ వ్యర్థాలు ఎంతో ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్లల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రత్యేక స్టాల్స్‌లో విక్రయించడం ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చన్నారు. ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడానికి సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఎమ్పీటీసీలు గోవింద్, సత్యానారాయణ, ఉప సర్పంచ్ అత్తంటి సోమరాజు, కార్యదర్శి తల్లాప్రగడ రవిచంద్ర, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సారిక, వార్డు సభ్యులు పరిమి సురేష్, సచివాలయ సిబ్బంది, హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని 24, 25 వార్డులలో వైద్యాధికారి డాక్టర్ శిరీషచే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు విషయంలో ప్రజలు వద్ద నుంచి బ్లడ్ శాంపిల్స్ తీయాలని, అనంతరం ల్యాబ్‌లో ఏ విధంగా టెస్ట్‌లు చేయాలో అవగాహన చేశారు. అనంతరం ఆయా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇంటింటా ప్రచారాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, జ్యోతి, ఆశాలు జ్యోతి, కుమారి, సీతారత్నం, కాంతారావులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల ఆవిష్కరణ

అత్తిలి: పర్యావరణ పరిరక్షణలో ఉమర్ ఆలీషా రూరల్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్వర్ణ ఆంధ్రా-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో గృహాలకు పంచిపెట్టే చేతిసంచులను ఎమ్మెల్యే రాధాకృష్ణ శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉమర్ ఆలీషా పీఠం కన్వీనర్ నందం తాతయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణానికి హానిలేని గన్నీ సంచులను త్వరలో ప్రజలకు పంపిణీ చేస్తామని చెప్పారు. సర్పంచ్ గంటా విజేత, ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహనతో నష్ట నివారణ



గూడెంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మాక్‌డ్రిల్‌లో మంటలను అదుపుచేస్తున్న డాక్టర్ అరుణ



అత్తిలి ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఆశాఖ అధికారి గణేశ్న వెంకట రామారావు అన్నారు. శనివారం పట్టణంలోని మదర్‌వన్నినీ ఆసుపత్రిలో ఫైర్ డెమెలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన, మాక్‌డ్రిల్‌లు జరిగాయి. అగ్ని ప్రమాదాలు– తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ద్వారా ఆసుపత్రి సిబ్బందికి చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా తప్పించుకోవాలో, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివిధ విన్యాసాలతో, వివిధ పరికరాలను ప్రదర్శించారు. తొలుత పట్టణంలో ర్యాలీ జరిగింది. కరపత్రాలను పంపిణీ చేశారు. రామారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రారంభ దశలోనే వాటిని అరికట్టాలని, పెను ప్రమాదాలు జరగకుండా చూడవచ్చునని చెప్పారు.

ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై అవగాహన

తణుకు అర్బన్: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఆలోచనతో ధైర్యంగా మంటలను నివారించే విధంగా ప్రయత్నించాలని తణుకు అగ్నిమాపక కేంద్ర అధికారి ఐ.అజయ్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే అందుబాటులో ఉన్న పరికరాలతో మంటలను నివారించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అత్తిలి: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది శనివారం అత్తిలి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, రోగులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల్లో రోగులను సురక్షిత ప్రాంతానికి తరలించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రమాదాల్లో మంటల వలనే కాకుండా పొగ పీల్చడం కారణంగా కూడా ప్రాణాపాయం ఉంటుందని వివరించారు. ఆస్పత్రి ఆవరణలో ప్రమాదాల నివారణకు ఉపయోగించే పరికరాలను ఉపయోగించే విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది, ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వ విద్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలంలోని వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిపాలన భవనంలో ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ నేతృత్వంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డాక్టర్ ఎల్.నారం నాయుడు, డీన్ ఆఫ్ హార్టీ కల్చరల్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డాక్టర్ జి.రామానందం, డాక్టర్ విజయపద్మ, ఉద్యోగులు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు

తణుకు అర్బన్: తణుకు కోర్టులో వచ్చేనెల 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీచేసేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. శనివారం కోర్టులో పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు మిగిలిన విభాగాలకు చెందిన కేసుల పరిష్కారానికి కక్షిదారులకు ఆమోదయోగ్యంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. కోర్టుల్లో పెండింగ్ కేసుల భారం పెరిగిందని, దానిని తగ్గించుకునేందుకు లోక్ అదాలత్ ఒక్కటే మార్గమని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ తణుకు బార్ అసోసియేషన్ ద్వారా ఎక్కువ సివిల్ కేసులు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పాతర్లంక, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్ కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగ రాజు, బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు కె. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హనుమంతరావు, ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠ రెడ్డి, కోర్టు పరిధిలోని ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్స్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 21 నుంచి 50 ఏళ్ల లోపు వారు స్వయం ఉపాధి పథకం రుణాలకు మే 10వ తేది లోపు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డు, 21 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత, పాస్‌పోర్టు సైజు ఫొటో, రవాణా పథకానికి ఆర్థిక సాయం కావలసిన వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని పేర్కొన్నారు. సదరు పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు క్రీస్తు ఆరాధనలు

పెంటపాడు: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని పలు చర్చిలలో ఆదివారం ఉదయం నుంచి క్రీస్తు ఆరాదన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పలు చర్చి సంఘ కాపరులు ప్రకటనలో తెలిపారు. తణుకు పైడిపర్రు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్, గూడెం బాగ్యలక్ష్మిపేట చర్చిలలో విశ్వాసులకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, ప్రేమవిందు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు



మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

అత్తిలి: బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ స్వరాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. స్టేషన్ పరిధిలో శనివారం పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించగా గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 10 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నామని చెప్పారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేసామని వెల్లడించారు. ఈదాడులలో తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

పెనుగొండ: స్థానిక అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామిని, అమ్మవార్లను డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు.